## క్లుప్తంగా

### రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


లలితా పరమేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీదేవి

బొండపల్లి: వైశాఖ బహుళ పంచమి సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు భక్తులకు లలితా పరమేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు చేయించారు.

### భగవద్గీత శ్లోకపఠన పోటీలు


పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

చీపురుపల్లి: స్థానిక కొత్తగవిడి వీధిలోని గీతా మందిరంలో విద్యార్థులకు సోమవారం సాయంత్రం భగవద్గీత శ్లోక పఠనంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈపోటీలు రాత్రి 10 గంటల వరకు జరిగాయి. 50 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు స్టేట్‌బ్యాంక్ మేనేజర్ వి.ఎస్.ప్రకాష్‌రాజ్ బహుమతులు, ధ్రువీక రణ పత్రాలు అందజేశారు. శ్రీగీతా సత్సంగ్ సేవాశ్రమ సభ్యులు పాల్గొన్నారు.

### సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి

దత్తిరాజేరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సాధా రణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు చేయలేదు. అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించకుండా పరిచయ కార్యక్రమంతోనే ముగించారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించిన సభ్యులందరికీ ఎంపీడీఓ చంద్రకుమారి కృతజ్ఞతలు తెలిపారు.జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి,వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య శాఖ సిబ్బంది

కొత్తవలస: కౌమార బాలికలు, మహిళలు నెలసరి సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యారోగ్య శాఖ సిబ్బంది సూచించారు. ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినం సందర్భంగా వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు ఆధ్వ ర్యంలో మండలంలోని గొల్లలపాలెం, తుమ్మికాపల్లి, దేవాడ, రామలింగాపురం, నిమ్మలపాలెం, వీరభద్రపురం, ఉత్తరా పల్లిలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారి సింహాద్రినాయుడు మాట్లాడుతూ రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు జగదాంబ, పద్మావతి, నరసింహారావు, ఈశ్వరరావు,ఆరోగ్య సహాయకులు సత్యారావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే


ఊడికలపేటలో సర్వే చేస్తున్న ఐఈఆర్‌టీలు

డెంకాడ: మండలంలోని ఊడికలపేట గ్రామంలో ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు సర్వే మంగళవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి, దివ్యాంగులు ఎవరైనా ఉన్నారా అని వివరాలు సేకరించారు. గ్రామగ్రామానికి వెళ్తున్న ఐఈఆర్‌టీలు కె.అప్పలరాజు, బి.రవీంద్రలు 18 ఏళ్లలోపు దివ్యాంగ చిన్నారులను గుర్తిస్తున్నారు. అనంతరం భవిత కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. ఇప్పటివరకు 11 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించామని వారు తెలిపారు.

# ప్రశాంత ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

- జూన్ 4న లెండి కళాశాలలో ఓట్లు లెక్కింపు
- ఉదయం 5 గంటలకే కౌంటింగ్ ఏజెంట్లు రావాలి
- ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు
- ఏజెంట్ల సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి శాంతి


చీపురుపల్లి: చీపురుపల్లిలో కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమం కూడా అంతే ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహక రించాలని ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.శాంతి కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో మంగ ళవారం సమావేశం నిర్వహించారు. ఓట్లు లెక్కింపు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న లెండి కళాశాల లో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఆరోజున ఉదయం 5 గంటలకే పోలింగ్ ఏజెం ట్లు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉండాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్‌లు వద్ద ఈవీఎంలు తీసుకొచ్చే సమయానికి కౌంటింగ్ ఏజెంట్లు సిద్ధంగా ఉండాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు.నియోజకవర్గంలో 1,855 పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్ జరిగిందన్నా రు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఇంతవరకు 198 బ్యాలెట్లు వచ్చాయ న్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి 14 టేబుళ్లు ఉంటాయని చెప్పారు. అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఒక్కో పార్టీ నుంచి 20 మంది ఏజెంట్ల వరకు ఉండాలని, టేబుళ్ల వారీగా ఏజెంట్ల పేర్లను ముందుగానే తమకు తెలియజేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు అనుమతించబడవని స్పష్టం చేశారు. ఏజెంట్లు భోజనం కూడా లెండి కళాశాల ఆవరణలో ఉన్న క్యాంటీన్‌లో డబ్బులు చెల్లించి తీసుకోవాలన్నారు. నాలుగు మండలాల తహసీల్దార్‌లు, వైఎస్సార్ సీపీ చీపురుపల్లి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గవిడి నాగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విజనగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

#### కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన


గజపతినగరం రూరల్: గజపతినగరంలో కౌటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ సూర్యకళ

గజపతినగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ లెండి కళాశాలలో జూన్4 ఉంటుందని, కౌటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని గజపతినగరం ఎన్నికల అధికారి సూర్యకళ చెప్పారు. నియోజకవర్గ కేంద్రంలో అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో మంగళవారం ఆమె సమా వేశమయ్యారు. కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచిపూర్తయ్యే వరకూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఇప్పటికే మూడంచెల భద్రత, సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని చెప్పారు. తహసీల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తవలసలో ఆరోగ్య సురక్ష శిబిరం


శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ ఈశ్వరరావు

కొత్తవలస: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సచివాలయం–4లో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జనరల్, గైనిక్, పీడియాట్రిక్, ఈఎన్టీ విభాగాల డాక్టర్లు సేవలందించారు. 342 మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు.ఆర్థో, న్యూరో సమస్యతో బాధపడుతున్న ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశామని వైద్యాధికారి తెలిపారు.శిబిరాన్ని ఈఓపీఆర్డీ ధర్మారావు, మేజర్ పంచాయతీ ఈఓ కన్నబాబు పరిశీలించారు. వైద్య సిబ్బంది రమణమ్మ, బేబీ రాణి, ఆప్తాలమిక్ ఈశ్వరరావు, సచివాలయ,సిబ్బంది పాల్గొన్నారు.

### కళాశాల అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న హెచ్‌ఎం రెహమాన్

జామి: మండల కేంద్రంలో ప్రభుత్వం నూతనంగా జూనియర్ కళాశాల మంజూరు చేసిందని, ఈ ఏడాది నుంచి స్థానిక ఉన్నత పాఠశాల లో కళాశాల నిర్వహించనున్నామని ఎంఈఓ లు జయశ్రీ,గంగరాజు, హైస్కూల్ హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల/కళాశాలలో మండల పరిధి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి అంతా సహకరించాలని కోరారు. కళాశాలలో ఎంపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పించనున్నామని, విద్యార్థులు చేరేలా గ్రామాల్లో ప్రచా రం చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: గజపతినగరం, బొండపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న మండలంలోని గ్రామాలకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ బొండపల్లి ఏఈఈ ఆర్.శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కొనసాగుతున్న జిందాల్ కార్మికుల నిరసన

- నేడు యాజమాన్యంతో మరోదఫా చర్చలు


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఈశ్వరరావు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ముడిసరుకు కొరత కారణంగా ఎటువంటి ముందస్తు సూచన లు చేయకుండా కర్మాగారం యాజమాన్యం లే ఆఫ్‌ను ప్రకటించిది. నాటి నుంచి కార్మికులు కర్మాగారం ప్రధాన గేటు వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారు. అక్కడే వంటావార్పు చేస్తున్నారు. కార్మికులకు పలువురు ప్రముఖులు, కార్మిక సంఘాల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు మంగళవారం విప్లవ గీతాలతో కార్మికుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. కాగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు, యాజమాన్యానికి మధ్య మరో దఫా చర్చలు విశాఖపట్నంలోని ఏసీఎల్ కార్యాలయంలో బుధవారం జరగనున్నాయి. చర్చలు సఫలీకృతం కాకుంటే యాజమాన్యం దిగి వచ్చేవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని కార్మికులు చెప్పారు. అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు,కార్మిక సంఘాల నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చిన్నబాబు, గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన ధారగంగమ్మ సంబరం

- వైభవంగా ధారగంగమ్మ అనుపోత్సవం
- జనంతో కిక్కిరిసిన ఎస్.కోట
- సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి


ఊరేగింపులో శ్రీదేవి, శ్రీవారు, భూదేవి వేషధారులు


అమ్మవారి ఘటాల ఊరేగింపు

శృంగవరపుకోట: ఎస్.కోట గ్రామదేవత ధారగంగమ్మ పండగ అదరహో అన్నట్టుగా సాగింది. అంబరాన్నంటేలా సంబరం సాగడంతో పట్ట ణం అంతా పండగ పారవశ్యంలో మునిగింది. పట్టణంలో ఎటు చూసినా జనం, ఏ వీధి చూసినా కోలాహలమే. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ధారగంగమ్మ అమ్మవారి అణుపోత్సవం ఆరంభం అయ్యింది. గొల్లవీధిలో ఉన్న అమ్మవారి గద్దె ఇంటి వద్ద ధార గంగమ్మ అమ్మవారి ఆలయపూజారి వచ్చి ఘటాలు ఎత్తడంతో పండగ ప్రారంభం అయ్యింది. అక్కడ ఆలయ అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడుకు ఆశీర్వచనం చెప్పి స్వాగతం పలికారు. అదే సమయంలో సాలివీధి నుంచి అమ్మవారి దేవరప్రభను తెచ్చారు. దేవరను స్థానిక వైద్యుడు సత్యశేఖర్ మోశారు. అమ్మ సాగటానికి ముందు ఉభయగోదావరి, విశాఖ జిల్లాల నుంచి తెప్పించిన కళాబృందాలు కదులు తుండగా, వాటి వెనుక అనువంశిక పూజారి, అమ్మవారి దేవర, ఘటాలు పురవీధుల్లో జనవాహిని మధ్యసాగాయి. డోలు,సన్నాయి మోతలు, బ్యాండు బాజా లు, కోలాటాలు, చిరతలు, తీన్‌మార్ నృత్యాల నడుమ పండగ సాగింది. పట్టణంలో పలు వీధుల గుండా, పలు జంక్షన్ల మీదుగా సాగిన అనుపోత్సవం అర్ధ రాత్రి వరకూ కొనసాగింది. అదే సమయంలో స్థానిక ధారగంగమ్మ ఆలయంలో అమ్మవారి ని దర్శించుకునేందు కు భక్తులు బారులు తీరారు. వన్ వే జంక్షన్ సమీపంలో శ్రీనాధు రామచంద్ర రావు, జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశా రు. అమ్మ పండగలో అనువంశిక పూజారులు, సేవకులు, గ్రామపెద్దలతో పాటు పట్టణానికి చెందిన యువత, పోలీసులు అంతా పెద్ద ఎత్తున హాజరై ట్రాఫిక్ సమస్యలు లేకుండా, ఎక్కడా ఇబ్బందులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.


ఘటాల ఊరేగింపులో పూజారి గౌరినాయుడు, పెద్దలు


అమ్మవారి దేవరను మోస్తున్న డాక్టర్ సత్యశేఖర్


భక్తులకు మజ్జిగ సంపిణీ చేస్తున్న శ్రీనాధు రామచంద్రరావు కుటుంబీకులు


కోలాటం ఆడుతున్న మహిళల బృందం


నృత్యం చేస్తున్న కళాకారిణుల బృందం


ఆకట్టుకున్న అర్జున, శ్రీకృష్ణ, దుర్యోధనుల బళ్ల వేషాలు


అమ్మవారి వేషధారణతో ప్రదర్శన


కాంతార కళాబృందం ప్రదర్శన

## చామలాపల్లిలో ‘ఫ్యామిలీ డాక్టర్’


శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ సూచించారు. వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి, 104 వైద్యసిబ్బంది సంయుక్తంగా చామలాపల్లి గ్రామంలో మంగళవారం ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరంలో 42 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంత రం గృహసందర్శన చేసి బెడ్ రెస్ట్ తీసుకుంటున్న రోగులు, గర్భిణులకు వైద్య తనిఖీలు చేశారు. పంచాయతీ కార్యదర్శి భారతి, ఎంఎల్‌హెచ్‌పీ జానకి, ఆరోగ్యసిబ్బంది సత్యనారాయణ, సాయి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన


దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ వెంకటఅప్పలనాయుడు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగ ళవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్ల సీట్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6 గంటలకు పనులు ప్రారంభించి 11 గంటల లోపు ముగించాలని సూచించారు. జాబ్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారంద రికీ జాబ్ కార్డులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

**కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం**

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ వెంకట అప్పల నాయుడు మంగళవారం పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేస్తే గరిష్ఠ వేతనం అందుతుందన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

## దోమల నివారణకు చర్యలు


చామలాపల్లిలో ఏసీఎం ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని వావిలపాడు పంచాయతీ పరిధి కడకొండ, చామలాపల్లి గ్రామాల్లో దోమల నివారణకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది నేతృత్వంలో మంగళవారం ఏసీఎం 5 శాతం ద్రావణం పిచికారీ చేశారు. చామలాపల్లిలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రత్యేకాధికారి పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమతెరలను వినియోగించాలని సూచించారు. ఏసీఎం ద్రావణం పిచికారీ చేసిన గోడలకు మూడు నెలల వరకు సున్నం వేయవద్దని చెప్పారు. మళ్లీ మూడునెలల తర్వాత ఏసీఎం ద్రావణం పిచికారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మలేరియా యూనిట్ అధికారి శ్రీనివాసరావు, వైద్యాధికారి ధరణి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్యామలాంబ సిరిమానోత్సవం


సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు

గుర్ల: మండలంలోని దమరసింగి గ్రామ దేవత శ్యామలాంబ పండగ సందర్భంగా మంగళవారం సిరిమానోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో అమ్మవారి సిరిమానును ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తు లు సిరిమానుకు పూజలు చేశారు. అమ్మవారికి గ్రామస్తులు పసుపు, కుంకమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే


లారీ డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

బొండపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి రూ.10 వేల జరిమానా కానీ, జైలు శిక్ష కాని తప్పదని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. మండలంలో ని అంబటివలస, గొట్లాం గ్రామాల మధ్య జాతీయ రహదారి–26పై పోలీస్ సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ మద్యం తాగి వాహనాన్ని నడుపుతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లా డుతూ అధిక శాతం ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి వల్లే జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.అలాగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎన్నికల ఫలితాలు రోజున ర్యాలీలు, ప్రదర్శనలకు అనుమతి లేదని అన్నారు.

### రామతీర్థంలో హుండీల కానుకల లెక్కింపు నేడు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో హుండీల్లో భక్తుల కానుకల రూపంలో చేరిన ఆదాయాన్ని బుధవారం లెక్కిస్తున్నామని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రాములోరి ఆలయంలో ఉన్న హుండీలతో పాటు ఆలయ క్షేత్ర పాలకులైన ఉమాసదాశివస్వామి ఆలయంలో ఉన్న హుండీల కానుకలను కూడా లెక్కిస్తామన్నారు. జిల్లాకు చెందిన శ్రీవారి సేవా భక్తులంతా లెక్కింపులో పాల్గొంటారన్నారు.

## శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

- జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ జడ్జి జి.దుర్గయ్య


మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ సీనియర్ సివిల్ జడ్జి దుర్గయ్య

భోగాపురం: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొనే సమస్యలను శాంతియుత వాతావరణంలో పరిష్కరించుకోవాలని జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ జడ్జి జి.దుర్గయ్య తెలిపారు. మండలంలోని నందిగాం గ్రామంలో సర్పంచ్ గరే మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఎటువంటి కోర్టు వివాదాలు లేని పంచాయతీ నందిగాం పంచాయతీ అని ప్రశంసించారు. మీ.. మీ.. గ్రామాల్లోనూ ఎటువంటి భూ సమస్యలున్నా, ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య తగాదాలు ఉన్నా గ్రామపెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని, లేకపోతే జిల్లా లీగల్‌సెల్ అథారిటీ లేదా లాసెకు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఎటువంటి ఫీజు లేకుండా ఫ్రీ లాయర్‌ను పెట్టి మీ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ సివిల్ జడ్జి కె.విజయ కల్యాణి, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీవో జి.చంద్రకళ, సీఐ రవికుమార్ పాల్గొన్నారు.